వర్షం పడితే మునుగుడే.!

- వర్షం కురిస్తే పంటలు మునుగుతాయి
- ఆందోళన చెందుతున్న రైతులు
- కాలువకు మరమ్మతు లేకనే ఈ పరిస్థితి

వేములవాడఅర్బన్: వర్షాలు కురిస్తేనే పంటలు బాగా పండుతాయి. వర్షాలు కురువాలి, పంటలు పండాలని రైతులు ఆ వరుణున్ని వేడుకుంటారు. కాని ఇక్కడ మాత్రం విచిత్రమైన పరిస్థితి.. రైతులు వర్షాలు వద్దంటున్నారు. వర్షాలు కురిస్తే తమ పొలాలు నీటిలో మునిగిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షపు నీటితో పొలాలు మునిగి ఆ నీరు వెళ్లిపోవాలంటే వారం రోజులు పడుతోందని ఆవేదన చెందుతున్నారు.



గొల్లపల్లెలో వర్షానికి నీట మునిగిన పంట పొలాలు (ఫైల్)

వేములవాడ మున్సిపల్ నాంపల్లి పరిధిలోని గొల్లపల్లె శివారులోని లోతట్టు వ్యవసాయ భూముల్లోని పొలాలు ప్రతి సంవత్సరం ఎడతెరిపి లేకుండా కురుస్తున్నా భారీ వర్షానికి పట్టా భూములు సుమారుగా 40 ఎకరాలు వరి నాటు వేసిన పొలాలు నీట మునుగుతున్నాయి. ఆ నీరు వెళ్లేందుకు వారం రోజులు పడుతుంది. అప్పటి వరకు వేసిన నాటు ఉంటుందో లేదో అని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎప్పుడు చిన్న వర్షం కురిసిన ఈ పంట పొలాలు మునిగిపోవడంతో పంట పండే వరకు కూడా నమ్మకం లేదని, పెట్టిన పెట్టుబడి కూడా రాని రోజులు ఉన్నాయని రైతులు అంటున్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షానికి వరి పంటలు మునిగిపోయాయి. ప్రతి సంవత్సరం వ్యవసాయ అధికారులు వర్షాలకు నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్నారు. కాని పంట నష్టం మాత్రం అందించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మరమ్మతుకు నోచుకోని కాలువ

లోతట్టు ప్రాంతం పొలాల నుంచి వర్షం నీరు మూలవాగులోకి వెళ్లేందుకు గతంలో గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు ఉపాధిహామీలో కాలువ పనులు చేసేవారు. ఇప్పుడు ప్రతి సంవత్సరం రైతులు తమ జేబు నుంచి డబ్బులు పెట్టుకుని కాలువకు ఉన్న పిచ్చి మొక్కలు, కాలువకు మరమ్మతులు చేయించేవారు. కాని ఈ మూడు సంవత్సరాలుగా మాత్రం కాలువకు మరమ్మతులు చేయకపోవడంతో ఆ నీరు వెళ్లలేక పొలాల్లోనే అగిపోతున్నాయని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకుని పంట కాలువకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

కాలువ దాటలంటే ఇబ్బంది

వర్షపు నీరు మూలవాగులోకి వెళ్లే కాలువలో నుంచి పొలాల వద్దకు వెళ్లేందుకు దారి ఉండటంతో ఆ కాలువ దాటేందుకు రైతులు భయందోళన పడుతున్నారు. వర్షం నీరు ఉధృతంగా రావడంతో కాలువ దాటలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువ దాటేందుకు దారిలో పైపులు వేయించాలని రైతులు కోరుతున్నారు.

ప్రతీ సంవత్సరం ఇదే పరిస్థితి



ప్రతీ సంవత్సరం మూడు ఎకరాలు నాటు వేస్తున్నాం. వర్షాలకు మునుగుతుంది. మళ్లీ నాటు వేస్తున్నాం. కాని పంటలు పండే దాకా నమ్మకం లేదు. పెట్టుబడి డబుల్ అవుతోంది. కాలువ సక్రమంగా ఉండి నీరు వెళ్తే పంటలకు నష్టం ఉండదు.

– చిర్రం శ్రీనివాస్. రైతు గొల్లపల్లె

పొలం మునిగింది



మాకున్న ఎకరం పొలం నాటు వేశాం. నాట్లు పూర్తి కాగానే భారీ వర్షం కురిసి నాటు నీటిలో మునిగింది. వారం రోజుల వరకు నాటు మొత్తం మురిగిపోయింది. మళ్లీ నాటు వేసిన కాని మళ్లీ వర్షం కురిసి మునిగింది. చేసిన కష్టానికి, పెట్టుబడికి ఫలితం లేకుండా పోతోంది.

– మధు, యువ రైతు, గొల్లపల్లె

కాలువకు మరమ్మతు చేయాలి



లోతట్టు పొలాల నుంచి మూలవాగులోకి నీరు వెళ్లే కాలువకు మరమ్మతులు చేయిస్తేనే తప్ప పొలాలు పంటపండే అవకాశం లేదు. వేసిన పొలాలు మొత్తం నీటిలో మునుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కాలువకు మరమ్మతు చేయించాలని కోరుతున్నాం.

– జంగం గంగరాజు రైతు గొల్లపల్లె

క్లుప్తంగా

జిల్లా గ్రంథాలయానికి టెట్ పుస్తకాలు



పుస్తకాలను అందిస్తున్న కాపిల్ల నరేశ్

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లా గ్రంథాలయానికి టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)కు సంబంధించిన 250 పుస్తకాలను ఇగురం యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులు కాపిల్ల నరేశ్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు చేతుల మీదుగా జిల్లా గ్రంథాలయాల చైర్మన్ ఆకునూరి శంకరయ్యకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ రానున్న ఈ సమయంలో ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడుతాయని వితరణ చేసిన కాపిల్ల నరేశ్‌ను అభినందించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలోకి రానున్న అభ్యర్థుల కోసం ఒక ఉపాధ్యాయుడిగా తనవంతు బాధ్యతగా టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ మెటీరియల్ అందించడం సంతోషమన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా బాధ్యులు జక్కని నవీన్, లైబ్రేరియన్ శంకరయ్య, మాధవి పాల్గొన్నారు

అంగన్‌వాడీల సమ్మె నోటీస్



తహసీల్దార్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న అంగన్‌వాడీలు

తంగళ్లపల్లి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మండల అంగన్వాడీ టీచర్లు, సహాయకులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు చెల్లించాలని, వేతనంలో సగం పింఛన్ నిర్ణయించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా గౌరవ అధ్యక్షుడు టుకుమల్ల సమ్మయ్య, అధ్యక్షురాలు కల్లూరి చందన, ప్రధాన కార్యదర్శి మమత, ఉపాధ్యక్షురాలు ఒరగంటి శ్యామల, కల్వకుంట్ల పద్మ, నాగలక్ష్మి, అంజలి, అయేషా, సుధారాణి, కొండికొప్పుల పద్మ, వాణి, పద్మ పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని గాంధీచౌక్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు బ్యాంక్ అధికారులు సోమవారం అవగాహన కల్పించారు. స్వనిధి సమృద్ధి స్కీమ్, డిజిటల్ లావాదేవీలు, రుణాలు, వీధి వ్యాపారుల కుటుంబాల అభివృద్ధి సంబంధించి తదితర స్కీమ్‌ల గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ పీఎస్ వీరాంజనేయులు, ఫీల్డ్ ఆఫీసర్ వినయ్, మెప్మా సిబ్బంది, వీధి వ్యాపారులు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ఎజెండా

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట: ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం ఇల్లంతకుంటలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు క్యాంపు కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించి, చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లకు మూడుసార్లు వేతనాలు పెంచి సీఎం కేసీఆర్ అంగన్‌వాడీలను ఆత్మగౌరవంతో బతికేలా చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, వెంకట్రావుపల్లి సర్పంచ్ సుశీల, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, ఇల్లంతకుంట ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్ పాల్గొన్నారు.



చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి



బస్సులు లేక అవస్థలు



వేములవాడఅర్బన్: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్న ఆలయానికి శ్రావణ సోమవారం భక్తులు పోటెత్తారు. ఆదివారం రాత్రి ఆలయానికి చేరుకున్న భక్తులు సోమవారం తిరుగు ప్రయాణంలో వేములవాడ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. సోమవారం సాయంత్రం ఓ పక్క కుండపోత వర్షం, బస్టాండ్‌లో బస్సులు లేక ప్రయాణికులు బస్టాండ్‌లో నిలబడేందుకు కూడా స్థలం లేక నానా ఇబ్బందులు పడ్డారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థికి బాధితుల మొర

వేములవాడరూరల్: తుఫాన్ ప్రభావంతో వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని మళ్లీ రెండోసారి కురుస్తున్న వర్షాలకు నివాసాల వద్దకు కూడా నీరు చేరుతుందని పలువురు బాధితులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు మొర పెట్టుకున్నారు. మండలంలోని హన్మాజిపేట, బొల్లారం, లింగంపల్లి గ్రామాల్లో వర్షం వల్ల దెబ్బతిన్న పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. పలువురు బాధితులు ఆదుకోవాలంటూ మొర పెట్టుకోగా, ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఆయనతో పాటు మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల రవీందర్‌గౌడ్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రాంరెడ్డి, సీఐ కృష్ణకుమార్, ఎస్ఐ మారుతి, బాలు, నాయకులు కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, రైతులు పాల్గొన్నారు.



చల్మెడకు మొర పెట్టుకుంటున్న మహిళలు

సర్పంచ్ భర్తపై ఫిర్యాదు

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్ల గ్రామ సర్పంచ్ కొమ్ము స్వప్న భర్త దేవరాజుపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామయువకులు ఎంపీడీవో రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో అభివృద్ధి పనులపై ప్రశ్నించిన యువకులపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేయిస్తున్నాడన్నారు. సర్పంచ్ పదవిని అడ్డం పెట్టుకుని ఇలాంటి కార్యకలాపాలు చేపడుతున్న అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని గుండ వెంకటేశ్, సాయిగౌడ్, సృజన్, హరీశ్, శేఖర్, సంపత్, శ్రీనివాస్, విజయ్ కోరారు.

సంక్షిప్త వార్తలు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ముస్తాబాద్: లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై శేఖర్‌రెడ్డి కోరారు. చిన్న చిన్న తగాదాలు, కుటుంబకలహాలతో కేసుల పాలైన వారు రాజీమార్గమే రాజమార్గంగా భావించి కోర్టులో నిర్వహించే లోక్‌అదాలత్‌లో సమస్యలకు పరిష్కారం చూసుకోవచ్చన్నారు. కేసుల పరిష్కారానికి సిరిసిల్ల రూరల్ సీఐ ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. ఎలాంటి కేసులు ఉన్న రాజీ కుదుర్చుకునే అవకాశాలు లోక్ అదాలత్‌లో ఉన్నాయన్నారు.

ప్రోటోకాల్ పాటించలేదు

కోనరావుపేట: మండలం సుద్దాలలో జరిగిన గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవంలో పాలకవర్గం ప్రోటోకాల్ పాటించలేదని ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ ఆరోపించారు. గ్రామాభివృద్ధిలో పాలుపంచుకుంటున్న తనను కావాలని ఆహ్వానించలేదని, ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

సహచర విద్యార్థినికి చేయూత

ఎల్లారెడ్డిపేట: తమతో కలిసి చదువుకున్న విద్యార్థిని కుటుంబానికి ఆపద రావడంతో పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం అందించారు. మండలంలోని రాగట్లపల్లి గ్రామానికి చెందిన గొర్రె స్రవంతి 2013–2014లో పదో తరగతి చదువుకుంది. స్రవంతి భర్త ప్రణీత్ ఇటీవల మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. ఆసుపత్రులకు వెళ్లాలంటే చేతిలో చిల్లి గవ్వలేదు. ఈ విషయం తెలుసుకున్న అప్పటి పూర్వవిద్యార్థులు తమవంతుగా సోమవారం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

పెద్దలింగాపూర్‌కు పీహెచ్‌సీ మంజూరు

ఇల్లంతకుంట: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పది గ్రామాల ప్రజలకు ఈ ఆరోగ్య కేంద్రం ఉపయోగపడుతుందని సర్పంచ్ జితేందర్‌గౌడ్ తెలిపారు.

108లో ప్రసవం

గంభీరావుపేట: పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ మహిళకు 108 వాహన సిబ్బంది ప్రసవం చేసిన సంఘటన గంభీరావుపేట మండలం జగదాంబతండాలో సోమవారం జరిగింది. తండాకు చెందిన లత అనే మహిళ పురిటినొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరిన వాహన సిబ్బంది ఆమెకు వాహనంలో ప్రసవం చేశారు. లత మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డలను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరూ క్షేమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపినట్లు వాహన సిబ్బంది సత్తయ్య, పైలట్ రాములు తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

వేములవాడఅర్బన్: బోయినపల్లి మండలంలోని జగ్గారావుపల్లి గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలతో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ భూమిపూజ చేశారు. అలాగే బోయినపల్లి మండల కేంద్రానికి చెందిన 13 మంది రైతు కుటుంబాలకు రూ.65 లక్షల రైతు బీమా ప్రొసిడింగ్‌లను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే మర్లపేట గ్రామంలోని రేణుక ఎల్లమ్మ ఆలయానికి జెడ్పీటీసీ ఉమ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ సిబ్బందితో గ్రామసభ

రుద్రంగి: మండలంలో 2021 మార్చి నుంచి 2023 మార్చి వరకు జరిగిన పనులపై ఈజీఎస్ సిబ్బందితో స్థానిక గ్రామపంచాయితీలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రసమయి మూడోసారి గెలుస్తారు

ఇల్లంతకుంట: ప్రజల ఆశీర్వాదంతో మానకొండూర్ ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్ మూడోసారి భారీ మెజార్టీతో గెలుస్తారని జెడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్, అనంతారం గ్రామాల్లో బీఆర్‌ఎస్ బూత్ ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

ఏఎంసీ వైస్‌చైర్మన్‌కు సన్మానం

ముస్తాబాద్: పోతుగల్ ఏఎంసీ వైస్‌చైర్మన్‌గా నియామకమైన నాగుల శ్రీనివాస్ గౌడ్‌ను బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు.

ఎస్సైగా సుధాకర్

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట ఎస్సైగా చిగురుమామిడి నుంచి సుధాకర్ బదిలీపై వచ్చారు. సోమవారం సుధాకర్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం, ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సమాచారం

రేపు మినీ జాబ్ మేళా

సిరిసిల్లకల్చరల్: హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం బుధవారం మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్, బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగులు మేళాలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. అన్ని విద్యార్హతల సరిఫికెట్లు జిరాక్స్ ప్రతులతో పాటు ఒరిజినల్ కాపీలతో నేరుగా సర్దార్‌నగర్‌లోని స్టడీసర్కిల్‌లో ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.11 వేల వేతనం అందజేస్తామన్నారు. మిగిలిన వివరాల కోసం 93818 88746 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తెలుగు టీచర్లు కావలెను

వేములవాడఅర్బన్: బోయినపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో తెలుగు పీజీటీ బోధించుటకు గంటల ప్రాతిపదికన అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. ఎంఏ తెలుగు, బీఈడీ అర్హత గల వారు పాఠశాలలో ఈ నెల 6లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నియామకం

కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా రాజాగౌడ్

గంభీరావుపేట: కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా కొత్తపల్లి గ్రామానికి చెందిన గుర్రం రాజాగౌడ్ నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులకు రాజాగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరు కాపు యువజన సంఘం కమిటీ

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణ మున్నూరు కాపు యువజన విభాగం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుర్రం శ్రీనివాస్ పటేల్, ప్రధాన కార్యదర్శి సంగెం భాను, ఉపాధ్యక్షుడిగా బల్యాల శ్రీకాంత్, మధు, కూస శ్రావణ్, బల్యాల జనార్దన్, కోశాధికారి దుమాల రంజిత్, కార్యదర్శులు సుంకరి సాయి, కొట్టె భాను, అనిల్, నాగారాజు, రవితో పాటు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ అగ్గిరాములు, జిల్లా అధ్యక్షుడు దూమాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



జవాన్ భార్యకు ప్రొసీడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే

వేములవాడఅర్బన్: బీఆర్‌ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలం తడగొండ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త అనిఫా కుటుంబానికి ప్రమాదబీమా చెక్కును సోమవారం అందించారు.

ఆర్మీజవాన్ కుటుంబానికి రైతు బీమా

కొద్దినెలల క్రితం హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందిన బోయినపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ పబ్బల అనిల్‌కుమార్ భార్య సౌజన్యకు రూ.5 లక్షల రైతు బీమా పొసీడింగ్‌ను ఎమ్మెల్యే అందజేశారు.

నేడు ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభ

వేములవాడఅర్బన్: అదనపు టీఎంసీ వరద కాలువ నిర్మాణం పనుల్లో బోయినపల్లి మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన పలు ఇళ్లు, కొట్టాలు ముంపునకు గురవుతున్న విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన ఆర్‌అండ్‌ఆర్ పీడీఎఫ్ గెజిట్‌కు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వేములవాడ ఆర్డీవో మధుసూదన్, బోయినపల్లి తహసీల్దార్ పుష్పలత పాల్గొననున్నారు. కాగా ఇప్పటివరకు మూడు పర్యాయలు ఎటు తేల్చకుండానే గ్రామసభలు వాయిదా పడ్డాయి. ఇప్పటివరకు నలుగురు తహసీల్దార్లు, ముగ్గురు ఆర్డీవోలు బదిలీ అయ్యారు. కొంతమంది ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కావాలని, మరికొందరు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద డబ్బులు కావాలని పట్టుపడుతున్నారు. సీనియర్ నాయకులు గ్రామంలో కొంతమంది మధ్య సయోధ్య కుదిర్చి గ్రామసభను సజావుగా సాగేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఏదిఏమైన లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని పలువురు కోరుతున్నారు.

కర్పూర క్షేత్రాన్ని సందర్శించిన భాషా పండితులు

వేములవాడరూరల్: సినారె జన్మస్థలమైన వేములవాడ మండలంలోని హన్మాజిపేట గ్రామంలోని ఆయన కర్పూర క్షేత్రాన్ని జిల్లాలోని భాషా ఉపాధ్యాయులు సోమవారం సందర్శించారు. డా.సి. నారాయణరెడ్డి తల్లిదండ్రులు సుశీల, నారాయణరెడ్డి సమాధిలతో పాటు సినారె స్మృతివనంలను వివిధ మండలాలకు చెందిన 90 మంది భాషా ఉపాధ్యాయులు సందర్శించారు. ఈ సందర్భంగా ఈ క్షేత్రాన్ని సందర్శించడం ఎంతో స్ఫూర్తినిచ్చిందని వారన్నారు.



హన్మాజిపేటలోని సినారె కర్పూర క్షేత్రం వద్ద భాషోపాధ్యాయులు

సన్మానం



అధ్యక్షులను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బొప్పాపూర్ ముదిరాజ్ సంఘం బొమ్మనవేని బేడకు అధ్యక్షుడిగా ఎంపికైన బొమ్మనవేని నారాయణ, ముదిరాజు పెద్ద బేడకు అధ్యక్షుడిగా ఎన్నికైన తమ్మనవేని సత్యంను గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కొండపురం బాల్‌రెడ్డి సన్మానించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొండా రమేశ్‌గౌడ్, కిషన్‌గౌడ్, తమ్మనవేని నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట సర్పంచ్‌కు..

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి ఇటీవల జాతీయ స్థాయిలో ఉత్తమ సామాజిక సేవా కార్యకర్త అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సర్పంచ్ దంపతులను స్థానిక మార్కండేయ ఆలయంలో పద్మశాలీ మహిళలు సోమవారం సన్మానించారు. మరెన్నో అవార్డులు పొందాలని ఆకాంక్షించారు.

రాజన్న సేవలో..



వేములవాడ: ఊరు కాని ఊరు.. జిల్లా కాని జిల్లా నిర్మల్ నుంచి సొంత ఖర్చులతో రాజన్న సన్నిధిలో సేవలందిస్తున్నారు రాజరాజేశ్వరి సేవా సంస్థకు చెందిన మహిళలు. సొంత ఊరు నుంచి అర్ధరాత్రి 2 గంటలకు వేములవాడకు చేరుకుని వేకువజామున 4 గంటల నుంచి రాజన్న భక్తులకు ఉచితంగా సేవలందిస్తున్నారు. సోమవారం పులిహోర ప్రసాదం తయారు చేసే పనిలో ఇలా నిమగ్నమయ్యారు.

పోయిన సెల్‌ఫోన్ అప్పగింత



ఎల్లారెడ్డిపేట: 15 రోజుల క్రితం పోయిన సెల్‌ఫోన్‌ను పోలీసులు సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ యాప్ ద్వారా గుర్తించారు. పోలీసులు గుర్తించిన సెల్‌ఫోన్‌ను సోమవారం పోలీసులు బాధితురాలి బంధువుకు అందజేశారు. వివరాలను ఎస్సై రమాకాంత్ వెల్లడించారు. కరీంనగర్‌కు చెందిన సయ్యం సౌమ్య తన సెల్‌ఫోన్ గత నెల 17న మండలంలోని రాచర్లగొల్లపల్లిలో పోయినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐఎంఈఐ నెంబర్ ద్వారా యాప్ సహాయంతో సెల్‌ఫోన్ గుర్తించి స్వాధీనం చేసుకోని బాధితురాలి బంధువుకు ఎస్సై అందజేశారు.